సాక్షి వికారాబాద్

శనివారం ǀ 27 ǀ సెప్టెంబర్ ǀ 2025



గ్రూప్ -1 ఫలితాల్లో..

ధారూరు మండలం నాగసమందర్ యువకుడు ఓంకార్‌యాదవ్ గ్రూప్– 1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యారు. 10లో▸



ఊరెళ్తున్నారా.. భద్రం!

దసరా, బతుకమ్మ పండుగల కోసం సొంత ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాల్సి అవసరం ఉంది. 11లో▸



బ్రహ్మోత్సవాల్లో ..

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ జానపద కళాకారులు చక్కటి ప్రదర్శన ఇస్తున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

డాక్టర్ వినయ్‌కుమార్‌కు జిల్లా ఆస్పత్రి బాధ్యతలు



తాండూరు: తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి గర్భిణి మృతికి కారణమైన సూపరింటెండెంట్ సునీతపై వేటు వేసిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో వినయ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

శిథిలావస్థ ఇళ్లను గుర్తించండి

మున్సిపల్ కమిషనర్ యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

తాండూరు టౌన్: పట్టణ పరిధిలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ యాదగిరి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సిబ్బందితో సమావేశమయ్యారు. భారీ వర్షాలు కురుస్తున్నందున పాత ఇళ్లు, శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వార్డుల వారీగా ప్రమాదకర ఇళ్లను గుర్తించాలన్నారు. వాటిని తొలగిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. అలాగే జనావాసాల మధ్య చెత్తాచెదారం వేయకుండా చూడాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో డీఈ మణిపాల్, మేనేజర్ నరేందర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు.

చెరుకు ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

తాండూరు రూరల్: తట్టెపల్లి ప్రాంతంలో చెరుకు ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో సీఈఓ చంద్రమౌళి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దేముల్ మండలంలోని తట్టెపల్లి, బుద్ధారం, గాజీపూర్, పెద్దేముల్ గ్రామాల్లో రెండు వేల ఎకరాల్లో రైతులు చెరుకు పంట సాగు చేస్తున్నారని తెలిపారు. నాబార్డు నిధులతో పరిశ్రమను నెలకొల్పుతామని పేర్కొన్నారు. ఇందు కోసం ఎకరా భూమి కేటాయించాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. సొసైటీ పాలకవర్గం సభ్యులు ఉప్పరి మల్లేశం, హన్మంత్, రహీం, శంకర్, శ్రీరాం, దిగంబరం, సుక్కమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయండి

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమండ్ చేశారు. ఏడాదిలోగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. అసెంబ్లీ వేదికగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఇదే అంశంపై నిరాహార దీక్ష చేస్తున్న అశోక్ సార్ ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తోందన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. అశోక్ ఆరోగ్యం మెరుగు పడే వరకూ ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలన్నారు.

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి శ్రీనివాసుడు హనుమంత వాహనంపై విహరించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరిగింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న శివారెడ్డిపేట్ ప్రాజెక్టు

కుండపోత

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం

- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- మోమిన్‌పేటలో 80 మిల్లీ మీటర్ల వర్షపాతం
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- కొట్టుకుపోయిన రోడ్లు
- పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

వికారాబాద్: జిల్లాలో రెండు రోజుల క్రితం ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. శుక్రవారం ఉదయం కొన్ని చోట్ల భారీగా.. మరికొన్ని చోట్ల అతి భారీగా కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. పలు మార్గాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహ నాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గడిచిన 24 గంటల్లో మోమిన్‌పేటలో అత్యధికంగా 80 మిల్లీ మీటర్లు, వికారాబాద్‌లో 77, కుల్కచర్లలో 76, నవాబుపేటలో 74.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పరిస్థితిని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర పలు ప్రాంతాల్లో పర్యటించి వరద పరిస్థితిని అంచనావేశారు.

నిండుకుండలా..

జిల్లాలో మొత్తం 1,187 చెరువులు ఉండగా అన్నీ పూర్తిగా నిండాయి. 900 చెరువులు అలుగు పారుతున్నాయి. మిగిలినవి సైతం వందశాతం నీటి మట్టానికి చేరువలో ఉన్నాయి. ఫీడర్ చానళ్లు, ఆక్రమణలకు గురైనవి మాత్రం అలుగు పారడంలేదు. లఖ్నాపూర్, కాకరవాణి, నందివాగు, అల్లాపూర్, శివసాగర్, సర్పన్‌పల్లి, జుంటుపల్లి తదితర ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి

- కాగ్నా, మూసీ, ఈసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు మార్గాల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రైతులు పొలాల వద్దకు వెళ్లలేకపోతున్నారు.
- ధారూరు మండలం దోర్నాల, రుద్రారం, నాగసముందర్, పరిగి వాగు, గొడుగోనిపల్లి, గెరిగేట్‌పల్లి, అత్తాపూర్, ధన్నారం మార్గాల్లో వాగులు బ్రిడ్జిల పైనుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. బంట్వారం మండలంలోనూ ఇదే పరిస్థితి ఉంది.
- తాండూరు నియోజకవర్గంలో కాగ్నా పరవళ్లు తొక్కుతోంది. బషీరాబాద్, యాలాల, తాండూరు మండలాల్లో పలు చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నవాబుపేట మండలంలోని చించల్‌పేట, గంగ్యాడ తదితర చోట్ల మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది.
- భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పత్తి, కంది పంటలకు నష్టం వాటిల్లింది.
- వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి.

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం	మిల్లీ మీటర్లు
మర్పల్లి	49.3
మోమిన్‌పేట్	80.3
నవాబుపేట	74.8
వికారాబాద్	77.1
పూడూరు	59.8
పరిగి	61.1
కుల్కచర్ల	76.9
దోమ	48.6
బొంరాస్‌పేట్	39.9
ధారూరు	62.1
కోట్‌పల్లి	26.3
బంట్వారం	32.5
పెద్దేముల్	13.2
తాండూరు	31.2
బషీరాబాద్	23.3
యాలాల	38.3
కొడంగల్	27.2
దౌల్తాబాద్	13.6
చౌడాపూర్	25.3
దుద్యాల్	28.0



పరిగి: నస్కల్ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అప్రమత్తంగా ఉండండి

అనంతగిరి/పరిగి: భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో కలిసి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో ప్రమాదం జరిగే అవకాశం ఉన్న 50 వాగులు, బ్రిడ్జిలను గుర్తించి రెవెన్యూ, పోలీసులు కాపలా ఉండేలా ఏర్పాట్లు చేశారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఉధృతంగా ప్రవహించే వాగులు దాటొద్దని గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్నచోట బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి పరిగి, వికారాబాద్ మున్సిపల్ పరిధిలో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలను పరిశీలించారు. వాతావరణ శాఖ మన ప్రాంతాన్ని రెడ్ అలర్ట్‌గా ప్రకటించిందని పేర్కొన్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున పెద్ద పెద్ద భవనాల వద్ద, చెట్ల కింద ఉండరాదన్నారు. కలెక్టర్ వెంట వికారాబాద్, పరిగి మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు
- బతుకమ్మ ఆడిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

అనంతగిరి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబురమని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో డీఆర్‌డీఏ, మెప్మా, ఉద్యానవన, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై గౌరీమాత పూజ చేసి వేడుకలను ప్రారంభించారు. మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ సందడి చేశారు. కలెక్టర్ బతుకమ్మ ఆట ఆడి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీ లాల్, అడిషనల్ డీఆర్‌డీఏ నర్సింహులు, శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి, డీపీఆర్‌ఓ చెన్నమ్మ, డీపీఓ జయసుధ, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

హైవేల అభివృద్ధికి నిధులివ్వండి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు: జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. శుక్రవారం వారు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ – తాండూరు రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించాలని కోరారు. ఇప్పటికే జిల్లాలోని మన్నెగూడ వరకు నేషనల్ హైవే ఉందని, అక్కడి నుంచి తాండూరు వరకు, తాండూరు నుంచి ముంబై జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా జహీరాబాద్ వరకు విస్తరించాలని కోరారు. ఇందుకోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు స్పీకర్, ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నేత ఉత్తమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



దోమ: బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

పరిగి/దోమ: పేదల ఆరోగ్య పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండలం బొంపల్లికి చెందిన నలుగురికి రూ.1.70 లక్షల విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రభాకర్ రెడ్డి, కిష్టాపూర్‌కు చెందిన అంజిలయ్య గౌడ్ నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, గ్రంథాల సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బొంపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకట్, నాయకులు అంతిరెడ్డి, రాములు, రమేశ్, శేఖర్, బషీర్, హైమద్, ఇంతియాజ్, హరిలాల్, గోపాల్, యాదయ్య, నర్సింహులు, వెంకట్‌రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా..

సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులను గుర్తించి సీఎం సహాయనిధి మంజూరు చేశారన్నారు. అనారోగ్యానికి గురై ప్రైవేట్‌లో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిగి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి తీరుతామన్నారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ ఇతర అధికారులు

అనంతగిరి: వీరనారి, గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌డీఓ మంగీలాల్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మాధవరెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి, డీపీఆర్‌ఓ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏటీసీల ప్రారంభోత్సవం

తాండూరు: జిల్లాలో శనివారం నుంచి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు అందుబాటులోకి రానున్నాయి. తాండూరు, వికారాబాద్, మర్పల్లి ప్రాంతాల్లో సుమారు రూ.200 కోట్లు వెచ్చించి భవనాలు, ఇతర సదుపాయాలు, వివిధ యంత్రాలు అమర్చారు. వీటిని శనివారం ప్రజా ప్రతినిధులు ప్రారంభించనున్నట్లు తాండూరు ఏటీసీ సెంటర్ ప్రిన్సిపాల్ ఎస్.సాయన్న తెలిపారు. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. ఒక్కో సెంటర్‌లో 172 మంది విద్యార్థుల చొప్పున మూడు కేంద్రాల్లో 516 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.



తాండూరు పట్టణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్

క్లుప్తంగా

గ్రూప్‌- 1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపిక


తల్లిదండ్రులతో ఓంకార్‌యాదవ్‌

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్‌ యువకుడు మామిళ్ల ఓంకార్‌యాదవ్‌ గ్రూప్‌- 1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన శంకరప్ప, యశోద దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు సంతానం. చిన్నవాడైన ఓంకార్‌ న్యూఢిల్లీలోని గురుగావ్‌లో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌గా పనిచేసేవాడు. మూడేళ్ల క్రితం ఉద్యోగం మానేసి, గ్రూప్‌ వన్‌ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో డీఎస్పీగా ఉద్యోగం సాధించడంపై అతని తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

ఎంపీడీఓగా క్రాంతి


క్రాంతి

తాండూరు: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బాలమణి, న్యాయవాది కురువ గోపాల్‌ కుమారుడు క్రాంతి గ్రూప్‌- 1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అతని స్నేహితులు, స్థానికులు అతన్ని అభినందించారు.

మహిళతో అసభ్య ప్రవర్తన ఉపాధ్యాయుడిపై కేసు

దౌల్తాబాద్‌: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలోని చంద్రకల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పక్కింట్లో ఉండే మహిళ ఒంటరిగా ఉందని గమనించిన ఉపాధ్యాయుడు లోనికి వెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. అతని నుంచి తప్పించుకున్న బాధితురాలు భర్తకు సమాచారం ఇచ్చింది. అనంతరం పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయుడు నర్సింలు కొడంగల్‌ మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నాడు.

రోడ్లపై నాటేసి నిరసన!


లగచర్లలో రోడ్డుపై నాటు వేస్తున్న బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు

దుద్యాల్‌: భారీ వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని పలు రోడ్లు దారుణంగా తయారయ్యాయి. వీటికి కనీస మరమ్మతులు కూడా చేయడం లేదంటూ బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం లగచర్ల గ్రామంలోని పాఠశాల ఎదుట బురదమయంగా మారిన రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. వీరిలో బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్‌ బసప్ప, మాజీ ఉప సర్పంచ్‌ రాఘవేందర్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, మణికంఠగౌడ్‌, బోగమోని మహేశ్‌, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డికి బెయిల్‌


జైలు నుంచి విడుదలైన నాగిరెడ్డికి స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్‌ నేతలు

దోమ: అనుమతులకు మించి మైనింగ్‌ చేశారనే కేసులో 45 రోజులుగా చంచల్‌గూడ జైలులో రిమాండ్‌ ఖైదీగా ఉన్న దోమ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల నాగిరెడ్డికి బెయిల్‌ మంజూరైంది. ఈక్రమంలో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి ఆయనకు స్వాగతం పలికారు.

రెస్టారెంట్‌కు రూ.పది వేల జరిమానా

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణంలోని అనంత్‌ బార్‌ అండ్‌ రెస్టారెంట్‌లో కిచెన్‌ నిర్వహణ సరిగా లేదని వినియోగదారులు నిర్వాహకులను శుక్రవారం నిలదీశారు. వెంటనే హోటల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ఏసుదాసు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. ముందుగా కిచెన్‌ను పరిశీలించగా అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించారు. అనంతరం ఫ్రిజ్‌లో వండిన చికెన్‌, మటన్‌ ఉండటాన్ని పరిశీలించారు. దీంతో అధికారులు రూ.10వేల జరిమానా విధించారు. మరోసారి పరిశుభ్రత పాటించకపోయిన, ఇష్టానుసారంగా నిల్వ ఉంచినా సీజ్‌ చేస్తామని హెచ్చరించారు.

మళ్లీ ఉరిమిన వరుణుడు

విరామం లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు వరుణుడు తన ప్రతాపాన్ని చాటాడు. దీంతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. పంట పొలాల్లోకి వరదనీరు పోటెత్తింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ముఖ్యంగా ఈసీ, మూసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లేడ్‌ చౌదరిగూడ మండలంలో వాగు దాటే క్రమంలో ఓ వ్యక్తి వరద ప్రవాహానికి కొట్టుకుపోయాడు. స్థానికులు, పోలీసులు గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. దీంతో ప్రజలు సురక్షితంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. పంటలు మునగడంతో వరి, పత్తి తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. **– సాక్షి, నెట్‌వర్క్‌**

ఆర్టీసీ బస్సుల రద్దు


పొంగిపొర్లుతున్న కంకణాలపల్లి వాగు

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కంకణాలపల్లి, నూరుల్లాపూర్‌ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వికారాబాద్‌, కోట్‌పల్లి లోకల్‌ బస్సును శుక్రవారం పూర్తిగా రద్దు చేశారు.

ఉప్పొంగిన కాగ్నా


కోకట్‌ కాగ్నా బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

యాలాల: మండంలో భారీ వర్షం పడుతుండటంతో కాగ్నా, కాకరవేణి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోకట్‌ కాగ్నా నది బ్రిడ్జిపై నుంచి ఉప్పొంగడంతో తాండూరు–రాస్నం మార్గంలో రాకపోకలు నిలిచాయి. జుంటుపల్లి, శివసాగర్‌ ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు చేరుతుండటంతో నిండుకుండలా మారాయి.

రోడ్డు మూసివేత


వాగు పొంగడంతో అల్లాపూర్‌ వద్ద రోడ్డు మూసివేత

కుల్కచర్ల: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కుల్కచర్ల, చౌడాపూర్‌ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో వాగులు పొంగి పొర్లాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కుల్కచర్ల మండల పరిధిలోని రాంనగర్‌, ముజాహిద్‌పూర్‌, అల్లాపూర్‌, ఘనపూర్‌ గ్రామాల్లో చెరువులు నిండాయి.


మోమిన్‌పేటలో అలుగు పారుతున్న నందివాగు ప్రాజెక్టు

నీట మునిగిన పంటలు

దోమ: మండల కేంద్రంలోని పెద్ద చెరువుతో పాటు ఆయా గ్రామాల చెరువులు మత్తడి దుంకుతున్నాయి. భారీ వర్షాలతో మొక్కజొన్న, పత్తి పంటల్లో నీరు నిలవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పర్యటించి నష్టపరిహారం అంచనా వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న దోమ, పాలేపల్లి వాగు

ధారూరులో కుండపోత

ధారూరు: కుండపోత వానకు మండలంలోని మోమిన్‌కుర్దు–మోమిన్‌కలాన్‌, హరిదాస్‌పల్లి–చింతకుంట, నాగారం–మైలారం, తరిగోపుల–జైదుపల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దాదాపు 13 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. రుద్రారం–నాగసమందర్‌ గ్రామాల మధ్య కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు ప్రవహిస్తున్నాయి.


నాగారం–మైలారం మధ్య కాగ్నా ఉపనది ఉగ్రరూపం


ఉధృతంగా కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు

ఇళ్లలోకి వర్షపు నీరు

కొడంగల్‌ రూరల్‌: మండల పరిధిలోని అప్పాయిపల్లి పరిధిలోని ఆశమ్మకుండాకు వెళ్లేదారిలో ఉన్న వాగు ఉప్పొంగింది. పర్సాపూర్‌ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


పర్సాపూర్‌లో ఓ ఇంటి ఆవరణలో నిలిచిన వర్షం నీరు

పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు


ఉధృతంగా సంగెంకలాన్‌ వాగు


భీకరంగా ప్రవహిస్తున్న బిజ్వార్‌ వాగు

తాండూరు రూరల్‌: జోరు వానకు మండల పరిధిలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. బొంకూర్‌, సంగెంకలాన్‌, వీర్‌శెట్టిపల్లి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చేతికొచ్చిన పత్తి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పెద్దేముల్‌ మండలం దారువాగుతండా వద్ద వరద ఉధృతి

పెద్దేముల్‌ మండలంలో గాజీపూర్‌ బ్రిడ్జి వద్ద బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జైరాంతండా, దారువాగుతండా వద్ద వాగు పొంగిపొర్లింది. సంకిరెడ్డిపల్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

పొలాల్లోకి వరద నీరు


రక్తమైసమ్మ దేవాలయం వద్ద వర్షం జోరు

మొయినాబాద్‌రూరల్‌: మండల పరిధిలోని నక్కలపల్లి, వెంకటాపూర్‌, కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్‌ గ్రామాల పక్కనే ఉన్న ఈసీ వాగు పంటపొలాల గుండా ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పూల తోటలు నీటిలో తేలి కనిపిస్తున్నాయి. అమ్డాపూర్‌ సమీపంలో ఈసీ వాగు బ్రిడ్జిపై సందర్శకుల తాకిడి నెలకొంది.


అమ్డాపూర్‌ వద్ద ఈసీ వాగు ఉధృతి


నందిగామ–నర్సప్పగూడ మార్గంలో వాగు ఉధృతి

స్తంభించిన రాకపోకలు

నందిగామ: నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లే రహదారిలోని వాగు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రాయాన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడకు వెళ్లే దారిలోని వాగు, నందిగామ నుంచి పిత్తిల్యామినేషన్‌ పరిశ్రమ పక్కనుంచి వీర్లపల్లికి వెళ్లే రహదారిలోని వాగు సైతం ఉధృతంగా ప్రవహించాచయి.

ఉధృతంగా మూసీ నది


చించల్‌ పేట వద్ద భీకరంగా మూసీ నది

నవాబుపేట: మండలంలో మూసీ నది పొంగిపొర్లింది. పక్కన ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో నీట మునిగాయి. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమంతా వర్షం పాలు అవుతుందని విలపిస్తున్నారు.


ముబారక్‌పూర్‌ రైల్వే వంతెన వద్ద వరద నీరు


ధన్నారం వాగును పరిశీలిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌, ఆర్డీఓ వాసుచంద్ర

వాగును సందర్శించిన కలెక్టర్‌

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణం, మండలంలో భారీ వర్షం కురుస్తోంది. గొట్టిముక్కుల వాగు, ద్యాచారం వాగు, పులుమద్ది, గిరిగేట్‌పల్లి, ఘుద్గుల్‌ చిట్టంపల్లి, ధన్నారం సమీపంలోని వాగులు ప్రమాదకరంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు బంద్‌ అయ్యాయి. ధన్నారం వాగును కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌ తదితరులు పరిశీలించారు.


వికారాబాద్‌లో ఆటోపై విరిగిపడిన చెట్టు


మంచన్‌పల్లి వాగు వద్ద ట్రాక్టర్‌ను అడ్డుపెట్టిన గ్రామస్తులు

నీట మునిగిన పంటలు

పూడూరు: మండలంలో కంకల్‌ ఈసీ వాగు ఉప్పొంగడంతో సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. దీంతో కంకల్‌ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. మిట్టకంకల్‌, కుత్బుల్లాపూర్‌, రేగడిమామిడిపల్లి, బార్లపల్లి, చన్గోముల్‌, పుడుగుర్తి, గ్రామాల్లోని వాగులు నిండుకుండలా పారుతున్నాయి.


కంకల్‌ బ్రిడ్జి వద్ద రోడ్డుపై పారుతున్న వరద నీరు

కూలిన ఇల్లు

కందుకూరు: మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. పొలాల నుంచి కాలువల ద్వారా కుంటలు, చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతుంది. వర్షాలతో బాచుపల్లి గ్రామంలోని ఎర్ర జంగయ్యకు చెందిన ఇల్లు గోడ కూలింది.


బాచుపల్లిలో గోడ కూలిన ఇంటిని పరిశీలిస్తున్న స్థానికులు

వైన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

- చివరి తేదీ అక్టోబర్‌ 18
- 23న కలెక్టరేట్‌లో లక్కీ డ్రా
- ఎక్సైజ్‌ సీఐలు రాఘవీణ, నీరజాదేవి

అనంతగిరి: వికారాబాద్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలోని 12 మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులను వచ్చే నెల 18వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు ఆ శాఖ సీఐ రాఘవీణ తెలిపారు. అన్ని పని దినాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు మున్సిపల్‌ కార్యాలయం పక్కనే ఉన్న ఎక్సైజ్‌ ఆఫీసులో అప్లికేషన్లు తీసుకుంటారని పేర్కొన్నారు. 12 దుకాణాల్లో 9 ఓపెన్‌ కేటగిరీ కాగా, గౌడ సామాజిక వర్గానికి రెండు షాపులు (వికారాబాద్‌ మున్సిపల్‌, నవాబ్‌పేట మండల కేంద్రం గెజిట్‌ సీరియల్‌ నంబర్‌ 26, 29), ఎస్సీ సామాజికవర్గానికి ఒకటి (ధారూరులోని గెజిట్‌ నంబర్‌ 27) రిజర్వ్‌ చేసినట్లు స్పష్టంచేశారు.


నీరజాదేవి

15 షాపులకు రిజర్వేషన్లు

పరిగి: పరిగి ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలోని 15 వైన్‌ షాపులకు రిజర్వేషన్లు కేటాయించామని ఎక్సైజ్‌ సీఐ నీరజాదేవి తెలిపారు. వీటిలో 11 షాపులు ఓపెన్‌ కేటగిరీకాగా, మూడు ఎస్సీ, ఒకటి ఎస్టీ సామాజికవర్గాలకు రిజర్వ్‌ చేశారని పేర్కొన్నారు. ఈనెల 26న ప్రారంభమైన అప్లికేషన్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్‌ 18 వరకు కొనసాగుతుందని, ఆసక్తి ఉన్నవారు జిల్లా ఎక్సైజ్‌ అధికారి కార్యాలయంలో లేదా నగరంలోని నాంపల్లి ఆఫీసులో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు రుసుము రూ.3 లక్షలు డీడీ లేదా చలాన్‌ రూపంలో చెల్లించాలన్నారు. 23న కలెక్టరేట్‌లో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు.